RNI NO.APTEL/2012/53127 TELANGANA VANI TELUGU DAILY
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక
The Voice of Telangana
గురువారం , 23 - 4 -2026

దుద్దేపూడి గ్రామంలో ఉచిత వైద్య శిబిరం విజయవంతం

తల్లాడ ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి):

సత్తుపల్లి మండల పరిధిలోని దుద్దేపూడి గ్రామంలో సత్తుపల్లి లైన్స్ క్లబ్, లయన్స్ ఐ హాస్పిటల్ , వైరా ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో కంటి వైద్య నిపుణులు డాక్టర్ జి. రవిచంద్ర 200 మంది కంటి పరీక్షలు నిర్వహించి, 30 మందికి కంటి ఆపరేషన్స్ గుర్తించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజలకు లైన్స్ కంటి ఆసుపత్రి చేస్తున్న సేవలను అభినందించారు. లయన్ డాక్టర్ కాపా మురళి కృష్ణ ఐ హాస్పిటల్ నిర్వాకులు లయన్ డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, డాక్టర్ రవిచంద్ర,కంటి ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ లయన్ గొగడ రవి, సెక్రటరీ లయన్ యం.ఎస్.ఎన్. వి. రమణ, లయన్ ట్రెజరీ చల్లగుండ్ల అప్పారావు, సర్పంచ్ శ్రీమతి మొరంపూడి అనసూర్య, ఉప సర్పంచ్ మోరంపూడి శ్రీధర్ , లైన్స్ క్లబ్ సభ్యులు, వృద్ధులు, గ్రామ ప్రజలు సంఖ్యలో పాల్గొన్నారు.

చిన్నారుల భవిష్యత్తుకు పునాదులు అంగన్వాడి కేంద్రాలు

మేజర్ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మిరెడ్డి

తల్లాడ, ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి):

పోషక విలువలతో కూడిన ఆహారాన్ని చిన్నారులకు, గర్భిణీలు, బాలింతలకు అందిస్తూ చిన్నారుల భవిష్యత్తుకు అంగన్వాడి కేంద్రాలు పునాదులుగా నిలుస్తున్నాయని మేజర్ పంచాయతీ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు అన్నారు. బుధవారం తల్లాడ మేజర్ పంచాయతీ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ అంగన్వాడి సెంటర్ లో పోషణ పక్వా డ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం సర్పంచ్ ఉప సర్పంచ్ చేతుల మీదుగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పుట్టే పిల్లలకు జన్యుపరమైన సమస్యలు రాకుండా, భవిష్యత్తులో పిల్లలు అనారోగ్యానికి గురికాకుండా మానసికంగా దృఢంగా ఉండేందుకు గర్భిణీ స్త్రీలకు అంగన్వాడి సెంటర్ల ద్వారా బలమైన పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నట్లు చెప్పారు. జీరో నుండి ఆరు సంవత్సరాల లోపు పిల్లలను అంగన్వాడీ సెంటర్లలో చేర్పించాలని తద్వారా తల్లిపాలుతో పాటు అంగన్వాడి సెంటర్ లో అందించే పోషక విలువలు ఉన్న ఆహారాన్ని పిల్లలకు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్క తల్లిని అంగన్వాడి సెంటర్లో ఏ ఏ ఆహారం అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. చిన్నారులను ప్రేమగా పలకరిస్తూ ముచ్చటించారు. సమస్యలు ఏమైనా ఉన్నాయని సర్పంచ్ అడిగారు. అందుకు తల్లులు అంగన్వాడి బిల్డింగ్ లేక ఇబ్బందులు పడుతున్నామని బిల్డింగ్ మంజూరయ్యే విధంగా కృషి చేయాలని కోరారు. అంగన్వాడి బిల్డింగ్ కు అనువైన స్థలాన్ని ఎన్టీఆర్ కాలనీలోని పరిశీలిస్తున్నామని సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని కొద్ది రోజుల్లోనే స్థల సమస్యను పరిష్కారం చేసుకొని బిల్డింగ్ నిర్మాణానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. 15 రోజులు జరగనున్న పోషణ పక్వాడ కార్యక్రమం గురించి ఏ సి డి పి ఓ నవ్య శ్రీ, సూపర్వైజర్ రోజా అరుణకుమారి గర్భిణులకు, బాలింతలకు వివరించారు. ఈ కార్యక్రమంలో తల్లాడ మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ కర్నాటి లక్ష్మిరెడ్డి, అంగన్వాడీ టీచర్ శైలజ, బాలింతలు గర్భిణీ స్త్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని జాగ్రత్తలు తీసుకోవాలి

- సింగరేణి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత

కొత్తగూడెం సింగరేణి (తెలంగాణ వాణి)

కొత్తగూడెం ఏరియాలోని పీవీకే.5 ఇంక్లైన్ మైన్‌లో సింగరేణి సంస్థ ఉద్యోగుల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని, ఎండాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించే కార్యక్రమం నిర్వహించబడింది. బుధవారం 1వ షిఫ్ట్, 2వ షిఫ్ట్‌లలో హెల్త్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా మెయిన్ హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శ్రీ లలిత ఉద్యోగులకు ఎండాకాలంలో సంభవించే హీట్ స్ట్రోక్, డీహైడ్రేషన్ వంటి సమస్యల గురించి వివరించి, వాటి నివారణకు తగిన జాగ్రత్తలను సూచించారు. తగినంత నీరు తాగడం, తేలికపాటి ఆహారం తీసుకోవడం, సూర్యరశ్మి నుండి రక్షణ పొందడం వంటి ముఖ్యమైన సూచనలు చేశారు.ఈ సందర్భంగా మైన్ మేనేజర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ, ఉద్యోగులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వైద్యుల సూచనలను తప్పని సరిగా పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమం ద్వారా ఉద్యోగుల్లో ఆరోగ్యంపై అవగాహన మరింత పెరిగింది. ఉద్యోగులు ఈ సూచనలను పాటిస్తూ తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అధికారులు సూచించారు. సింగరేణి సంస్థ ఇలాంటి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణకు కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో మెయిన్ హాస్పిటల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లలిత తో పాటు మైన్ మేనేజర్ శ్యామ్ ప్రసాద్ , వెల్ఫేర్ ఆఫీసర్ షకీల్ , ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ భూక్యా రమేష్, ఎన్ టి ఐ ఎన్ టి యు సి పిట్ సెక్రెటరీ శ్రీ చిలక రాజయ్య ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ అధికారులు సమస్య పరిష్కరించండి

ప్రమాదకరంగా మారిన కిన్నెరసాని పైపులైన్ కోసం తవ్విన గొయ్యి

ప్రమాదాలు జరిగి ప్రజలు గాయపడుతున్న పట్టించుకోని అధికారులు

కొత్తగూడెం (తెలంగాణ వాణి)

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలోని భజన మందిర్ నుంచి ఎస్పీ ఆఫీస్ వెళ్లే ప్రధాన రహదారి లో కిన్నెరసాని పైపులైన్లు పగిలిపోయినప్పటికీ కార్పొరేషన్ అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వేసవి కాలం నెత్తి మీదకు వచ్చినప్పటికీ పట్టణ ప్రజలకు మంచినీళ్లు అందించడంలో అధికారులు ఘోరంగా విఫలమయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రహదారుల ముఖ్యమైనదిగా సూచించబడుతున్న హనుమాన్ టెంపుల్ కు వెళ్లే రహదారి జంక్షన్లో కిన్నెరసాని పైపులైన్ పగిలి పది రోజులు అవుతున్నా కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదని, ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో ననని ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ప్రధాన రహదారిలో పైపులైను మరమ్మత్తుల కోసం సుమారు 20 అడుగులు తవ్విన గొయ్యి వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయటంతో గొయ్యి కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆ ప్రాంత ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.మరోపక్క ప్రజలు తాగునీరు రాక ఇబ్బందులకు గురవుతున్నారు.నడిరోడ్డుపై ఇంత పెద్ద గొయ్యి తవ్వినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.ప్రమాదాలు జరిగి ప్రజల ప్రాణాలు పోకముందే జిల్లా కలెక్టర్ స్పందించి కొత్తగూడెం కార్పొరేషన్ కమిషనర్ ఇంజనీరింగ్ విభాగం అధికారులతో మాట్లాడి కిన్నెరసాని పైపులను మరమ్మత్తులు చేపట్టి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆ ప్రాంత ప్రజలతోపాటు హనుమాన్ బస్తి ప్రజలు కోరుతున్నారు.

యూనివర్సల్‌లో సమ్మర్ క్రికెట్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

తల్లాడ, ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి):

స్థానిక యూనివర్సల్ విద్యాలయంలో సమ్మర్ క్రికెట్ క్యాంప్ ను పాఠశాల డైరెక్టర్ మేరీ సోఫియా, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మతీన్‌లు బుధవారం ఉదయం ప్రారంభించారు. బీసీసీఐ గుర్తింపు పొందిన కోచ్ నాగేశ్వరావు ఆధ్వర్యంలో జరుగుతున్న కోచింగ్ క్యాంప్ 50 రోజులు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కోచింగ్ క్యాంపులో బౌలింగ్ బ్యాటింగ్ ఫీల్డింగ్ నేర్పిస్తుందని ఆయన అన్నారు.ప్రతిరోజు ఉదయం 6 గ! నుండి 9 వరకు, సాయంత్రం 4 నుండి 7 వరకు ప్రాక్టీస్ ఉండుందని కోచ్ నాగేశ్వర్ రావు అన్నారు.ఈ సదుపాయం ప్రతి ఒక్కరు సాధ్వినియోగం చెయ్యాలని ఆయను కోరారు. ఆసక్తిగలవారు 90006 96047 ఫోన్ నెంబర్ లో కోచ్ నాగేశ్వరావు ను సంప్రదిచాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి ఖమ్మం జిల్లా బాలుర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి మతీన్ , రాము, యాకోబు, మోహన్, మనీషా, రవి తదితరులు పాల్గొన్నారు.

హిందూ సమ్మేళనానికి జిల్లా ఎస్.పి రోహిత్ రాజ్ కి ఆహ్వానం

కొత్తగూడెం (తెలంగాణ వాణి)

ఈ నెల 26న కొత్తగూడెంలో నిర్వహించనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించి సమ్మేళనం కమిటీ సభ్యులు బుధవారం జిల్లా ఎస్.పి శ్రీ రోహిత్ రాజ్ ని మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు సమ్మేళనం యొక్క ఉద్దేశాలు, కార్యక్రమ వివరాలు, నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఎస్.పి కి వివరించారు. కార్యక్రమం శాంతియుతంగా, క్రమబద్ధంగా నిర్వహించబడుతుందని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్.పి రోహిత్ రాజ్ కార్యక్రమ వివరాలు తెలుసుకుని, చట్టపరమైన నిబంధనలు పాటిస్తూ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు పి. వీరవర్ధనరావు, కార్యదర్శి లట్టి జగన్ మోహన్, సభ్యులు గుర్రం వెంకట్ రెడ్డి, పిల్లి రాజేశ్వరరావు, యెలదండి పూర్ణచందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పార్టీల జండాలతో అంబేద్కర్‌ను అవమానిస్తారా

కొత్తగూడడెం (తెలంగాణ వాణి)

కొత్తగూడెం పట్టణం పోస్ట్ ఆఫీస్ సెంటర్ సర్కిల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహం చుట్టూ రాజకీయ పార్టీ జెండాలను ఏర్పాటు చేయడాన్ని దళిత సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ఏర్పాటుచేసిన జెండాలను వెంటనే తొలగించాలని కార్పొరేషన్ మేయర్ మూడు గణేష్ కు దళిత సంఘాల నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. గత కొంత కాలంగా ఈ విధానం కొనసాగుతున్నదని అన్ని వర్గాలకు సమాన హక్కులు కల్పించి సమస్త వ్యవస్థలకి తను రాసిన రాజ్యాంగం ద్వారా రక్షణ కల్పిస్తున్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఏ రాజకీయ పార్టీ జెండాలు ఏర్పాటు చేయరాదని, అలా ఏర్పాటు చేస్తే ఆయనను అవమానించడమేనని, ఇప్పుడు ఏర్పాటు చేసిన వాటిని వెంటనే తొలగించాలని, రాబోవు కాలంలో కూడా ఏర్పాటు చేయకుండా కార్పొరేషన్ వారు ప్రత్యేక నిబంధనలు విధించాలని, వాటిని ఉల్లంఘిస్తే అధిక మొత్తంలో జరిమానా విధించే విధంగా చర్యలు చేపట్టాలని, అంబేద్కర్ విగ్రహం చుట్టూ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన మేయర్ అంబేద్కర్ రాజ్యాంగం ద్వారానే నేను మేయర్ అయ్యానని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు, ఈ కార్యక్రమంలో మద్దెల శివకుమార్, చర్మకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు చదలవాడ సూరి, మహిళా సమైక్య నాయకురాలు కరీష రత్నకుమారి, మాదిగ ఐక్యవేదిక నాయకులు వేల్పుల భాస్కర్, టిఎంఆర్పిఎస్ రాష్ట్ర నాయకులు గుండా రమేష్, అంబేద్కర్ సంఘం రాష్ట్ర నాయకులు మోదుగు జోగారావు, ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు కనకం సూరిబాబు, కార్పొరేటర్ సాగర్, దళిత సంగం జిల్లా నాయకులు చెనగా లక్ష్మణ్, మాదిగ యువజన నాయకులు మొగిలి పాక మురళి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బెట్టింగ్ మాయలో యువత..!

బెట్టింగ్ వ్యసనంతో యువత భవిష్యత్తు ప్రశ్నార్థకం

ఆత్మహత్యలకు పాల్పడుతున్న యువత

చిన్నాభిన్నమవుతున్న మధ్యతరగతి కుటుంబాలు

ఐపీఎల్ సీజన్ మరింత జోరుగా బెట్టింగ్‌లు

తల్లాడ, ఏప్రిల్ 22 (తెలంగాణ వాణి):

బెట్టింగ్ తో కొందరి జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయి. గెలిచిన వారు అత్యాశతో మళ్లీ డబ్బులు పెడుతూ పొగొట్టుకుంటున్నారు. ఓడిన వారు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ముఖ్యంగా విద్యావంతులైన యువత ఈ మాయలో పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. బెట్టింగ్ యాప్స్ భారిన పడి ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు సైతం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో చోటు చేసుకున్నాయి. ఆన్లైన్లో గేమ్ నుంచి మొద లైన వ్యసనం తర్వాత బెట్టింగ్స్ కు దారి తీస్తున్నాయి. ఒకప్పుడు పట్టణాలకే పరిమితం కాగా ఇప్పుడు పల్లెలకు సైతం పాకింది. ప్రస్తుతం ఐపీఎల్ షురూ కావడంతో క్రేజ్ పెరిగింది. దీనిని ఆసరాగా చేసుకొని కొంతమంది వ్యసనంగా మార్చుకున్నారు. యువతతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు బెట్టింగులకు ఆకర్షితులవుతున్నారు. తెలిసి తెలియని వయస్సులో బెట్టింగ్ ఉచ్చులో పడి ఆర్థికంగా నష్టాలను చవిచూ స్తున్నారు. కూలీనాలి చేసుకునే వారు, ప్రైవేట్ ఉద్యోగులు సైతం బాధితులుగామారుతుండడం గమనార్హం.

- లొకేషన్లు మారుస్తూ..!

ఆన్ లైన్ బెట్టింగ్ నిషేధం ఉన్నప్పటికీ యాప్ల ద్వారా లోకేషన్ చేంజ్ చేస్తూ వీటిని నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. కొందరు నిరుద్యోగ యువత యాప్ ద్వారా ఆన్లైన్ బెట్టింగ్స్ కొన సాగిస్తున్నారు. పదుల సంఖ్యల్లో వెబ్సైట్లు, యాప్లలో ఇది నడుస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఐపీఎల్ సందర్భంగా జోరుగా బెట్టింగ్ సాగుతున్నట్లు తెలుస్తోంది. జట్లలో ఆటగాళ్ల తీరు, మ్యాచ్ గెలిచేదెవరు. ఫోర్, సిక్స్. ఇలా అన్నింటికి వేల రూపాయల్లో బెట్టింగ్ పెడుతున్నారు. యువకులతో పాటు పలు వ్యాపారులు సైతం ఈ మోజులో పడి అప్పుల పాలవుతున్నారు. ఈ క్రెజ్ను దందాగా మలుచుకొని కొంత మంది బెట్టింగ్ యాప్ ద్వారా తమ జేబులు నింపు కుంటున్నారు.



- బెట్టింగులపై పోలీసుల ఫోకస్..!

ఆన్లైన్ బెట్టింగ్లపై పోలీసులు ఫోకస్. ఇంటిలిజెన్స్ నిగా పెట్టారు. సీసీఎస్ సిబ్బంది కన్నేసి ఉంచారు. ఎక్కడైనా ఆన్లైన్ బెట్టింగ్ సాగుతున్నట్లు సమాచారం అందిస్తే వెంటనే అప్రమత్తమ వుతున్నారు. వారిపై కేసులు పెడుతున్నారు. రాష్ట్రంలో ఆన్లైన్ బెట్టింగ్ నిషేధం ఉంది. ఇటీ వల ప్రభుత్వం అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు అదేశాలు జారీ చేసింది. దీంతో వారు అవగాహన కార్యక్రమాలతో పాటు బెట్టింగ్ లు అరి కట్టేందుకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు. ఎక్కడైనా బెట్టింగ్ జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని పోలీసులు చెబు తున్నారు.